క్లుప్తంగా

ఏఎస్‌పేట ఎంపీడీఓగా శ్రీనివాసులు



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట ఎంపీడీఓగా శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో మండలానికి ఎంపీడీఓగా ఎవరూ రాలేదు. దీంతో ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా వ్యవహరిస్తున్న ఏఓ శ్రీనివాసులుకు పూర్తి బాధ్యతలను అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

వరికుంటపాడు ఎంపీడీఓగా మల్లికార్జున



వరికుంటపాడు: మండల అభివృద్ధి అధికారిగా ఎస్ మల్లికార్జున గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయగిరి మండల ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న ఆయన్ని మండల ఎంపీడీఓగా నియమించి పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు.

మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరి

వరికుంటపాడు: రైతులు పంట సాగుకు ముందు తమ పొలాల్లోని మట్టి నమూనా పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ రవికుమార్ సూచించారు. మండలంలో వీఏఏలు సేకరించిన మట్టి నమూనాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి నమూనాలను పరీక్ష నిమిత్తం జిల్లా భూసార నిర్ధారణ పరీక్షల కేంద్రానికి పంపిస్తామన్నారు. ఫలితాల ఆధారంగా రైతులకు ఎరువుల వాడకంపై అవగాహన కల్పిస్తామన్నారు.

వెంకయ్యస్వామి ఆరాధన ఉత్సవాలు ప్రారంభం

చేజర్ల: మండలంలోని గాలిపాళెంలోని వెంకయ్యస్వామి ఆశ్రమంలో ఆరాధన ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు వెంకయ్యస్వామిని విశేషంగా అలంకరించి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. నాలుగు రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నెల 24న వెంకయ్యస్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు శ్రీహరిస్వామి తెలిపారు.

నేడు వెంకయ్యస్వామి ఆరాధన

ఆత్మకూరు రూరల్: దేపూరులోని వెంకయ్యస్వామి మందిరంలో 34వ ఆరాధన మహోత్సవాలను శుక్రవారం వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. వేకువన 4 గంటలకు సుప్రభాత సేవ, ఉదయం విశేషాభిషేకాలు, పూజలు, రాత్రి గ్రామోత్సవంనిర్వహించనున్నట్లు చెప్పా రు. మధ్యాహ్నం 12.30 గంటలకు, రాత్రి 8 గంటలకు భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు.

ఉపాధి కూలీ మృతి

అనుమసముద్రంపేట: ఉపాధి కూలీ గుండెపోటుతో మృతి చెందిన ఘటన ఏఎస్‌పేటలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఖాజామస్తాన్ ఉపాధి పనులు చేస్తూ కుప్పకూలిపోయాడు. సహచర కూలీలు 108 వాహనానికి సమాచారం అందించగా, వారు వచ్చి పరిశీలించేలోగానే ఖాజామస్తాన్ మృతి చెందినట్లు ఫీల్డ్‌అసిస్టెంట్ మస్తాన్ తెలిపారు. ఉపాధి ఈసీ నవీన్, ఏపీఓ పని ప్రదేశానికి వెళ్లి ఖాజామస్తాన్ మృతదేహాన్ని పరిశీలించారు.

నేడు ఉపాధి గ్రామసభలు

వరికుంటపాడు/ఉదయగిరి: వరికుంటపాడు, ఉదయగిరి, వింజమూరు మండలాల్లోని పంచాయతీల్లో ఉపాధిపై గ్రామసభలను శుక్ర వారం నిర్వహించనున్నట్లు ఆయా మండలాల ఎంపీడీఓలు ఎన్ మల్లికార్జున, ఈశ్వరమ్మ, మహేష్‌బాబు గురువారం తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనులను గుర్తించి తీర్మానాలను చేయనున్నట్లు చెప్పారు. పంచాయతీల్లోని ప్రజలు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



వరికుంటపాడు: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఏఎన్‌ఎం జానకిని వరికుంటపాడు సచివాలయ సిబ్బంది గురువారం ఘనంగా సత్కరించారు. శాలువాతో సన్మానించి భవిష్యత్తులో మరెన్నో అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈఓపీఆర్డీ సికిందర్, వీఆర్వో శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలపై ఆరా



వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు సీహెచ్ వసంతరావు, లక్కు శ్రీనివాసులురెడ్డి, కే శ్రీనివాసులు, బండి చెంచయ్య గురువారం సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. మందుల షాపులోని మందులను పరిశీలించి కాలం చెల్లిన వాటిని గుర్తించి వైద్యులకు చూపించారు. వైద్యశాలకు వెళ్లే మార్గంలో విద్యుత్ దీపాలు లేకపోవడాన్ని గుర్తించి వెంటనే ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తామని తెలిపారు.

మెట్టప్రాంత జలసిరి బొగ్గేరు

మెట్టప్రాంత జలసిరి బొగ్గేరు. వర్షం పడితేనే సాగుతుంది. వర్షాలు లేకుంటే ఎడారిగా మారుతుంది. భూగర్భజలాలు అడుగంటి పరీవాహక గ్రామాల ప్రజలు తాగు,సాగునీటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వర్షం పడిన సమయంలో బొగ్గేరు జలాలను ఒడిసిపడితే భూగర్భజలాలు వృద్ధి చెందుతాయి. పల్లెలు పచ్చదనం పరుచుకుంటాయి. రైతుల జీవితాల్లో వెలుగులు వస్తాయి. ఆ దిశగా పాలకులు దృష్టి సారించి బొగ్గేరుపై ఆనకట్టలు నిర్మించాలని మెట్టప్రాంత రైతులు కోరుతున్నారు.



బోయలచిరివెళ్ల వద్ద ముళ్ల పొదలతో నిండి ఉన్న బొగ్గేరు



గొల్లపల్లి వద్ద బొగ్గేరుపై బ్రిటీష్ హయాంలో నిర్మించిన స్లూయిస్

ఆత్మకూరురూరల్: మర్రిపాడు మండలం చాబోలు–వెంకటాపురం మధ్యన ఉన్న వెలుగొండల్లో చిన్నపాటి పాయగా బొగ్గేరు మొదలవుతుంది. కేతామన్నేరు, ముళ్లకంటేరు వాగులను తనలో కలుపుకొని ముందుకు సాగుతుంది. మర్రిపాడు మండలంలోని కంపసముద్రం, కృష్ణాపురం, ఉమ్మాయిపల్లి, బూదవాడ, చిలకపాడు, రాజులపాడు, సన్నువారిపల్లి, ఇర్లపాడు, మర్రిపాడు చెరువులను నింపుతుంది. భీమవరం వద్ద నిర్మించిన తొలి ఆనకట్ట ద్వారా భీమవరంతో పాటు నందవరం, రామానాయుడుపల్లి, డీసీపల్లి గ్రామాల్లోని చెరువులకు సాగునీరు అందిస్తోంది. మిగులు జలాలు గండ్లవీడు, వెన్నవాడ, జంగాలపల్లి మీదుగా కోనసముద్రం వద్ద నిర్మించిన రెండో ఆనకట్ట ద్వారా మహిమలూరు, బసవరాజుపాళెం చెరువులకు చేరుతాయి. తద్వారా నారంపేట, కోటపాడు, కరటంపాడు, మహిమలూరు, బసవరాజుపాళెం గ్రామాల్లోని ఆరువేల ఎకరాలను సస్యశ్యామలంగా మారుస్తుంది. ఆత్మకూరు నియోజకవర్గంలోని మూడు మండలాల్లోని 40కుపైగా గ్రామాలకు తాగు, సాగునీటిని తరతరాలుగా అందిస్తూ మెట్టప్రాంత జలసిరిగా మారిన బొగ్గేరులో వర్షాలు పడే సమయంలోనే ప్రవాహం ఉంటుంది. వర్షాభావ పరిస్థితుల్లో చుక్కనీరు ఉండదు. ఈ సమయంలో భూగర్భజలాలు అడుగంటి బోర్లు ఎండిపోయి తాగు, సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బొగ్గేరుపై ఆనకట్టలు నిర్మించి జలసిరిని ఒడిసిపడితే పంట సిరులతో రైతుల జీవితాల్లో వెలుగులు నిండుతాయి.

గొల్లపల్లి ఆనకట్ట ఆత్మకూరుకు ఆయువుపట్టు

బోయలచిరివెళ్ల పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి వద్ద బ్రిటీష్ హయాంలో బొగ్గేరుపై నిర్మించిన ఆనకట్ట ఆత్మకూరు ప్రాంత చెరువులకు ఆయువుపట్టుగా ఉంది. ఈ ఆనకట్ట ద్వారానే బొగ్గేరుతో పాటు సోమశిల ఉత్తర కాలువ జలాలు ఆత్మకూరు, చెర్లోయడవల్లి, వాశిలి, తదితర చెరువులకు చేరుతాయి. బొగ్గేరుకు అడ్డంగా 274.32 మీటర్లు వెడల్పున అడ్డుగోడలు నిర్మించి వాటిపై 1.80 మీటర్ల ఎత్తులో 85 ఫాలింగ్ షట్టర్లు ఏర్పాటు చేసి బొగ్గేరు ప్రవాహవేగానికి అనుగుణంగా ఏటీఎస్ ఛానల్ (ఆత్మకూరు చెరువు కాలువ)కు సాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ స్లూయిజ్ ద్వారా రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న చెర్లోయడవల్లి చెరువుతో పాటు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆత్మకూరు చెరువుకు బొగ్గేరు వరద నీరు చేరుతుంది. ఆత్మకూరు చెరువు అలుగు ద్వారా వాశిలి చెరువుకు సైతం బొగ్గేరు నీరు చేరుతుంది. ఈ జలాలతో అశ్వనీపురం, నువ్వూరుపాడు, పాతజంగాలపల్లి, ఆత్మకూరు, వాశిలి, పేరారెడ్డిపల్లి, నల్లపరెడ్డిపల్లి, నెల్లూరుపాళెం, తదితర గ్రామాల్లోని ఐదు వేల ఎకరాల్లో రైతులు బంగారు పంటలు పండించుకునేందుకు వెసులుబాటు కలుగుతోంది.

చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో భూగర్భజలాలు వృద్ధి

బొగ్గేరు ఉద్ధృతంగా ప్రవహిస్తే పరీవాహక చెరువులు అన్ని నిండి అప్పారావుపాళెం, వీర్లగుడిపాడు సమీపంలో పెన్నానదిలో కలిసి జీవజలాలు వృథాగా పోతున్నాయి. వర్షాకాలంలో కొద్ది రోజుల పాటు మాత్రమే ప్రవహించే బొగ్గేరును నీటి పారుదల శాఖ అధికారులు అధ్యయనం చేసి అవసరమైన చోట చెక్‌డ్యామ్‌లను నిర్మిస్తే భూగర్భ జలాలు పుష్కలంగా ఉంటాయి. తద్వారా తాగు, సాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్న 30 గ్రామాల ప్రజలు, పశువులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయి. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో చెక్‌డ్యామ్‌ల ప్రతిపాదన వచ్చినా ఆ తరువాత కాలంలో పాలకులు దృష్టి సారించలేదు. దీంతో సమస్య దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉందని బాధిత గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఏడారిగా మారి కొన్ని చోట్ల, ముళ్ల పొదలతో నిండి మరికొన్ని చోట్ల దుస్థితికి చేరిన బొగ్గేరును ప్రజోపయోగం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సర్వత్రా కోరుతున్నారు.

“ ముళ్లపొదలను తొలగించాలి



బోయలచిరివెళ్ల నుంచి నారంపేట వరకు బొగ్గేరు ముళ్ల పొదలతో నిండడంతో వర్షాకాలంలో నీటి ప్రవాహానికి ఇబ్బందిగా మారింది. దీంతో సమీపంలోని పొలాలు బొగ్గేరు వరదనీటితో కోతకు గురవుతున్నాయి. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా లేదా నీటిపారుదల శాఖ నిధులతో బొగ్గేరులో పూడిక తీయించి సజావుగా వరద నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి.

– రావూరు వెంగళరెడ్డి, రైతు, బోయలచిరివెళ్ల, ఆత్మకూరు మండలం

“ ఆనకట్ట నిర్మిస్తే రైతులకు ప్రయోజనం



నా చిన్నతనం నుంచి బొగ్గేరుపై ఆధారపడి పంటలు పండించుకుంటున్నాం. బొగ్గేరు పారితే భూగర్భజలాలు వృద్ధి చెంది బోర్లలో నీరు బాగుంటాయి. బొగ్గేరు సాగనప్పుడు భూగర్భజలాలు అడుగంటిపోయి సాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వెన్నవాడ–గండ్లవీడు మధ్యన చెక్‌డ్యామ్ నిర్మిస్తే భూగర్భజలాలు పెరుగుతాయి. దాని వల్ల రైతులకు శాశ్వత ప్రయోజనం కలుగుతుంది.

– కోటంరెడ్డి పుల్లారెడ్డి, రైతు, వెన్నవాడ, ఆత్మకూరు మండలం

28 నుంచి పొగాకు బ్యారెన్ల రిజిస్ట్రేషన్



రాజశేఖర్

మర్రిపాడు: 2024–25 పంట కాలానికి సంబంధించి పొగాకు బ్యారెన్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 28 నుంచి ప్రారంభమవుతుందని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ గురువారం తెలిపారు. అక్టోబర్ 23 వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా రిజిస్ట్రేషన్లను చేయనున్నట్లు చెప్పారు. ఆ తరువాత నవంబరు 7 వరకు రూ.100, నవంబర్ 11వరకు రూ.400 అపరాధ రుసుంతో రిజిస్ట్రేషన్లను రెన్యూవల్ చేయనున్నట్లు తెలిపారు. 2024–25 పంట కాలానికి పొగాకు బోర్డు ఒక బ్యారెన్‌కు దక్షిణ ప్రాంత తేలిక నేలల్లో 3.37 హెక్టార్లలో 4,275 కిలోల పొగాకు పండించేందుకు అనుమతించినట్లు చెప్పారు. గత పంట కాలానికి కన్నా 625 కిలోలు అధికంగా పండించేందుకు అనుమతించినట్లు చెప్పారు. పొగాకు బోర్డు అనుమతించిన పరిమితి మేరకే రైతులు పొగాకును పండించాలని సూచించారు. అధికంగా పొగాకును పండించడం వల్ల డిమాండ్ తగ్గిపోయి సరైన గిట్టుబాటు ధరలు రావన్నారు. ఈ ఏడాది ప్రపంచ దేశాల్లో పొగాకు ఉత్పత్తి పెరిగే అవకాశం ఉందన్నారు. బ్యారెన్లు, పొలాలు అధిక ధరలకు కౌలుకు తీసుకుని సాగుచేయడం వల్ల చాలా నష్టపోయే అవకాశముందని హెచ్చరించారు. అందువల్ల రైతులు పొగాకు పంటను తగ్గించి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు.

చిన్నారుల మానవతా దృక్పథం

చేజర్ల: అనారోగ్యం బారినపడిన వాచ్‌మెన్‌కు ఆర్థిక సాయం అందజేసి చేజర్లలోని లుంబిని పాఠశాల విద్యార్థులు తమ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. వివరాలు.. లుంబిని పాఠశాలలో బీ నర్సింహులు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. ఆయన కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పాఠశాల విద్యార్థులు స్పందించారు. ప్రతిరోజూ తమను ఆప్యాయంగా పలుకరించే వాచ్‌మెన్ నర్సింహులు ఆరోగ్యం కుదుటపడాలని వైద్యఖర్చుల కోసం విరాళాల ద్వారా రూ.40 వేలు సేకరించారు. వాచ్‌మెన్ భార్య మస్తానమ్మకు గురువారం అందజేశారు. మానవతా దృక్పథంతో వాచ్‌మెన్‌కు ఆర్థిక సాయం అందజేసిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ రమేష్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.



మస్తానమ్మకు ఆర్థిక సాయం అందజేస్తున్న విద్యార్థులు

దోషులను కఠినంగా శిక్షించాలి



సోమశిలలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన



ఆత్మకూరు: ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో...

సోమశిల: కోలకత్తాలో మహిళా జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ అనంతసాగరంలో సీఐటీయూ, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి అన్వర్‌బాషా మాట్లాడుతూ జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం అమానుషమని ఖండించారు. దేశంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. మహిళలపై లైంగికదాడులు పెరిగిపోతున్నా ప్రభుత్వాల్లో చలనం రావడం లేదన్నారు. కోలకత్తా ఘటనలో కీలకమైన నిందితుల పేర్లు బయటకు రానివ్వకుండా ప్రభుత్వమే కాపాడేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. అసలైన నిందితులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జేవీవీ నాయకులు వేము పెంచలయ్య, గాడి సుధాకర్, రైతు సంఘ మండల కార్యదర్శి ఉప్పలపాడు మస్తాన్, సీఐటీయూ మండలాధ్యక్షుడు మీరామొహిద్దీన్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ప్రమీల, ధనమ్మ, సబిరా, సుశీలమ్మ, సునీత, వెలుగు వీఏఓల యూనియన్ నాయకులు లక్ష్మి, సింధు, నవీన్, భూమిక, మిడ్డే మీల్స్ నాయకులు మహబూబ్‌జానీ పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆంధ్ర విద్యార్థి సంఘం (ఏవీఎస్) ఆధ్వర్యంలో పట్టణంలోని ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు నిరసన ప్రదర్శన చేపట్టారు. జూనియర్ డాక్టర్ చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కిషోర్‌రెడ్డి, ఏవీఎస్ విద్యార్థి సంఘం అధ్యక్షుడు మహంత్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఇస్రో ప్రశంసలు

సోమశిల : అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖరరెడ్డి ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్ సోమనాథ్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఇస్రో, మైగావ్ సంయుక్తంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో పాల్గొన్నందుకు గానూ తనకు ఈ ప్రశంసాపత్రాన్ని అందజేసినట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రయాన్–3 ప్రయోగం విజయానికి గుర్తుగా ఆగస్టు 23వ తేదీని జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకొంటున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించాలి

సీతారామపురం: మండలంలోని ప్రతి పంచాయతీలో ఉపాధి హామీ గ్రామసభలను నిర్వహించి గ్రామాలకు అవసరమైన పనులను గుర్తించి తీర్మానించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్ భార్గవి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో గురువారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామసభలకు ముప్పై శాతం మంది ప్రజలు హాజరయ్యేలా చూడాలన్నారు. పంచాయతీ సర్పంచ్‌ల అధ్యక్షతన జరిగే గ్రామసభల్లో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనుల ఎంపిక, ప్రస్తుతం జరుగుతున్న పనుల వివరాలను ప్రజలకు తెలియజేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు పూజలు



జలదంకి: మండల కేంద్రమైన జలదంకిలో పోలేరమ్మకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల గ్రామ నడిబొడ్డున ఉన్న 200ఏళ్ల నాటి పోలేరమ్మ చెట్టు ఎండిపోయింది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు పోలేరమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా గ్రామ నడిబొడ్డున పోలేరమ్మ చెట్టు ఉన్న ప్రదేశం వద్దకు చేరుకుని కొత్త మొక్కను నాటారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

సీఐకు సన్మానం

ఉదయగిరి: ఉదయగిరి సీఐ గిరిబాబును పలువురు నాయకులు గురువారం ఘనంగా సత్కరించారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకోవడంపై అభినందనలు తెలిపారు.

వాహనాల తనిఖీ



వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని బంగ్లా సెంటర్‌లో కలిగిరి సీఐ పీ వెంకటనారాయణ గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన వాహన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తమ వద్ద విధిగా పత్రాలను ఉంచుకుని వాహనాలు నడపాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 18 ఏళ్లలోపు వారికి వాహనాలు ఇస్తే వాహన యజమానులు, తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ఆధార్ కోసం అగచాట్లు



ఉదయగిరి: ఉదయగిరికి చెందిన షేక్ ఖాజవళి అందరూ ఉన్న అనాథ. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నప్పటికీ 17 ఏళ్ల క్రితం వారి నుంచి విడిపోయి ఒంటరిగా ఉంటున్నారు. అప్పట్నుంచి మద్యం షాపుల వద్ద సీసాలు ఏరుకుంటూ, అక్కడ పనిచేస్తూ పొట్ట పోసుకుంటున్నారు. అయితే ఆరు నెలల కిందట కుక్క కాటు వేసింది. సరైన వైద్యం చేయించుకోకపోవడంతో సెప్టిక్ అయి కాలు తీసివేశారు. దీంతో ఏ పని చేయలేక యాచనే గత్యంతరమైంది. ఈ నేపథ్యంలో పింఛన్ పొందేందుకు ఆధార్ కార్డు కోసం తహసీల్దార్ కార్యాలయం వద్దకు గురువారం వచ్చారు. తహసీల్దార్ లేకపోవడంతో నిరాశగా వెనుతిరిగారు. ఇంత వరకు తనకు ఆధార్ కార్డు లేదని, కొత్తగా ఆధార్‌కార్డు ఇస్తే పింఛన్‌కు దరఖాస్తు చేసుకుని పొట్ట పోషించుకుంటానని వాపోయాడు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో నడుచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం శోభ

కావలి : ఖైదీలు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం శోభ సూచించారు. కావలి సబ్‌జైలులో మండల లోక్ అదాలత్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సదస్సుకు సీనియర్ సివిల్ జడ్జి శోభ ముఖ్య అతిథిగా హాజరై ఖైదీలకు వారి హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. క్షణికావేశంలో నేరాలు చేసి జైలుకు వచ్చిన వారు సత్ప్రవర్తనతో నడుచుకుంటే శిక్ష తగ్గుతుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని సమాజంలో గౌరవంగా జీవించాలన్నారు. జైలు సూపరింటెండెంట్ చినసుబ్బయ్య , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ కావలి శాఖ సేవలు అభినందనీయం



కావలి రెడ్‌క్రాస్ బృందంతో విదేశీ ప్రతినిధులు

కావలి: రెడ్‌క్రాస్ కావలి శాఖ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని రెడ్‌క్రాస్ అంతర్జాతీయ బృందం ప్రతినిధి క్యాథెరిన్ మేరీ మార్టిన్ కొనియాడారు. కావలి రెడ్‌క్రాస్ శాఖను భారతదేశ సహకారాధికారి జాన్‌జార్జి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సమాచారాధికారిణి రాణి విభూషిత, ఆంధ్రప్రదేశ్ యూత్ కోఆర్డినేటర్ తెనాలి మధుబాబుతో కలిసి రెడ్‌క్రాస్ అంతర్జాతీయ బృందం గురువారం సందర్శించింది. వారికి కావలి రెడ్‌క్రాస్ ప్రతినిధులు డాక్టర్ బెజవాడ రవికుమార్, దాకారపు రవిప్రకాష్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రెడ్‌క్రాస్‌లోని రక్తనిధి, మరణానంతర సేవలు, యోగా, తదితర విభాగాలను అంతర్జాతీయ బృందం పరిశీలించింది. కావలి యూత్ రెడ్‌క్రాస్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రతినిధులు బీద లక్ష్మీసునంద, సౌందర్య దీపిక, కీర్తన, సావిత్రి, శ్రావ్య, ధాత్రి, తేజస్విని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం శివరామసుబ్బయ్య కాలనీలో కావలి యూత్ రెడ్‌క్రాస్ బాధ్యులు పీవీ సాయితేజ, పీ సాయికుమార్, బెజవాడ ప్రసన్నకుమార్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా 8వ వార్డులోని మున్సిపల్ హైస్కూల్‌కు నడిచి వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్న ముగ్గురు బాలికలు, ఒక బాలుడికి ప్రధానోపాధ్యాయుని సూచనల మేరకు నూతన సైకిళ్లను బహూకరించారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు దామిశెట్టి సుధీర్ నాయుడు, పార్వతీశంకర్, రాజశేఖర్, హరి నారపరెడ్డి, ప్రసన్నాంజనేయులు, మధుసూదన్ రెడ్డి, బీఎస్ ప్రసాద్, రెడ్‌క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ ఉద్యోగుల ఆందోళన



సహకార బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

వింజమూరు(ఉదయగిరి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో కంప్యూటరీకరణ విధానంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు స్థానిక జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. డేటా ఎంట్రీపై కనీస అవగాహన కల్పించకుండా ఉద్యోగులపై ఒత్తిడి తీసుకురావడం తగదన్నారు. ప్రాథమిక శిక్షణ ఇవ్వకుండా బాధ్యతలు అప్పగించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓలు మేకల రమణయ్య, మహేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం



కలిగిరి: మండలంలోని చంద్రారెడ్డిపాళెంలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు వేద పండితులు నారాయణం వెంకటరమణ దీక్షితుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు

టీడీపీలోని అవినీతిపై ఆవేదన

ఉదయగిరి: టీడీపీలో ఉన్న కొంతమంది అవినీతి పరులు, దళారీ వ్యవస్థలతో పార్టీని నమ్ముకున్న వ్యక్తులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆ పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు బీ నరసింహారాజు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ విడుదల చేసిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. తనతో పాటు అనేక మంది పార్టీ కోసం కృషి చేశారని, కానీ కొందరు దళారులు ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అవినీతి పరులను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు కాక ముందే టీడీపీలో లుకలుకలు బయట పడడంపై పలువురు చర్చించుకోవడం కనిపించింది.

దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి: గండిపాళెం గురుకుల పాఠశాలలో గెస్ట్ టీచర్లుగా పనిచేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ పుష్పరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, గణితం పోస్టులు ఖాళీ ఉన్నాయని చెప్పారు. 2018 డీఎస్సీ నియమ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారు ఈ నెల 27వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వ్యాక్సినేషన్ పరిశీలన

వరికుంటపాడు: ఇసుకపల్లిలో బీసీజీ వ్యాక్సినేషన్‌ను సీహెచ్‌ఓ రాజశేఖర్‌రాజు గురువారం పరిశీలించారు. ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు.